
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



క్రిస్మస్ సందడి షురూ..

ఈనెల 25న క్రిస్మస్ నేపథ్యంలో జిల్లాలో సందడి ప్రారంభమైంది. స్టార్లు, క్రిస్మస్ ట్రీలు తదితర అమ్మకాలు జోరందుకున్నాయి. 9లో



లెక్కల చిక్కుముడులు విప్పేలా..

గణితంపై విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగించేందుకు టీఎంఎఫ్ ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 18°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్న ఉష్ణోగ్రత సాధారణంగా నమోదవుతుంది. తెల్లవారుజామున, రాత్రి వాతావరణం కొంత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు.

వెండి పళ్లెం బహూకరణ..

యూఎస్‌కు చెందిన సందీప్ – శాంతి దంపతులు రూ. 60 వేల విలువైన వెండి పళ్లెంను స్వామివారికి బహూకరించారు. వారి తరుపున బంధువులు ఆలయ అధికారులకు అందజేశారు. కాగా, ఈనెల 26న ఉదయం 8 గంటలకు ఆలయ హుండీలను లెక్కించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఐడీఓసీలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


చిన్నారితో కేక్ కట్ చేయిస్తున్న కలెక్టర్

సింగరేణి(కొత్తగూడెం): ఐడీఓసీ కార్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిచారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ కేట్ కట్ చేసి మాట్లాడారు. శాంతి, సహనం, త్యాగం, ప్రేమ, కరుణకు తార్కణంగా క్రిస్మస్ జరుపుకుంటున్నామని చెప్పారు. క్రీస్తు జీవనం అందరికీ ఆచరణీయమన్నారు. ఆయన బోధనలు ప్రతీ ఒక్కరిని సన్మార్గంలో నడిపిస్తాయని, అందరూ ఐకమత్యంగా ఉంటూ ఎదుటివారిని క్షమించే గుణం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, సీపీఓ సంజీవరావు, ఏఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఎస్పీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్పీ

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఎస్పీ రోహిత్‌రాజ్ శనివారం సందర్శించారు. తరగతి, వసతి గదులతో పాటు బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ప్రతీ ఒక్కరు కష్టపడి చదవాలని, చెడు వ్యసనాలకు బానిస కావద్దని హితవు పలికారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ సీసీ నాగరాజు, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రెండు బంగారు పతకాలు కైవసం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో భాగంగా శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్‌కె.రియాజ్ రెండు బంగారు పతకాలు సాధించాడు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజ, వైస్ ప్రిన్సిపాల్ పూర్ణచందర్రావు, పీడీ వెంకన్న తదితరులు అభినందించారు.

చట్టవిరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం నేరం

కొత్తగూడెంఅర్బన్: చట్టవిరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం నేరమని జిల్లా సంక్షేమ అధికారి జి లెనినా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్టవిరుద్ధంగా పిల్లలను దత్తత ఇచ్చిన, తీసుకున్న వారికి మూడేళ్ల శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించారు. పిల్లలను అమ్మిన, కొన్నవారికి సైతం ఏడేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటాయని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం దత్తత ప్రక్రియను చట్టబద్ధం చేసిందని, పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు సెంట్రల్ ఎడాప్షన్ రిసోర్స్ అథారిటీ వెబ్‌సైట్‌లో సంబంధిత ధ్రువపత్రాలు జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు భద్రాచలం శిశుగృహ మేనేజర్(7893825921), సోషల్ వర్కర్(9949581435) నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.


బొగ్గు అన్వేషకుడు సీపీపీ విలియమ్స్ విగ్రహం

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు ఉత్పత్తితో ప్రస్థానం ప్రారంభించి నలు దిశలా విస్తరిస్తున్న సింగరేణి సంస్థ 135 వసంతాలు పూర్తి చేసుకుని సోమవారం 136వ పడిలోకి అడుగు పెట్టనుంది. ఈ నేపథ్యంలో సింగరేణి ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

- బొగ్గు ఉత్పత్తిలో 135 ఏళ్ల ప్రస్థానం
- ఇల్లెందులో తొలిసారిగా బొగ్గు తవ్వకాలు
- ఒకప్పుడు తెలంగాణకే ఉపాధి వనరు
- ప్రస్తుతం రాష్ట్రానికి బయటా విస్తరిస్తున్న సంస్థ

రేపు సింగరేణి డే..



భూగర్భ గనిలో పనిచేసేందుకు వెళ్తున్న కార్మికులు

ఇల్లెందు	1889
బెల్లంపల్లి	1928
కొత్తగూడెం	1936
రామగుండం	1961
మణుగూరు	1975
భూపాలపల్లి	1988

దక్కన్ ఒడిలో సింగరేణి సిరులు

రామభక్తులతో వెలుగులోకి..

భద్రాద్రి రామయ్య దర్శనానికి వెళ్లే భక్తులకు తొలిసారిగా ఇల్లెందు సమీపంలోని సింగరేణి గ్రామం దగ్గర బొగ్గు కనిపించింది. ఆ తర్వాత బ్రిటీష్ అధికారి విలియమ్స్ ఇక్కడ పరిశోధనలు చేసి నేలబొగ్గు ఉన్నట్టు 1870లో కనుగొన్నారు. దీంతో బ్రిటీషర్లు, అప్పటి నైజాం సర్కార్ సంయుక్తంగా దక్కన్ పేరుతో ఇల్లెందు ప్రధాన కేంద్రంగా బొగ్గు తవ్వకాలు ప్రారంభించారు. ఆ తర్వాత 1920 డిసెంబర్ 23న సంస్థ పేరును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చారు. అనంతరం గోదావరి లోయలో బొగ్గు నిక్షేపాలు వెదుకుతూ బెల్లంపల్లి, కొత్తగూడెంలో కోల్ మైనింగ్ ప్రారంభించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఈ సంస్థను నైజాం సర్కార్ నుంచి భారత ప్రభుత్వానికి బదలాయించారు. ప్రస్తుతం సింగరేణిలో కేంద్రం వాటా 49 శాతం ఉండగా రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతంగా ఉంది. ఇల్లెందు సమీపంలో మొదలైన సింగరేణి ప్రస్థానం ఇప్పుడు ఇతర రాష్ట్రాలకు, బొగ్గుతో పాటు ఇతర రంగాలకూ విస్తరించింది.

ఉపాధి వనరు..

సింగరేణి సంస్థ రాకముందు నైజాం జమానాలో జమీందార్ల వెట్టి చాకిరీ కింద ఉత్తర తెలంగాణ సమాజం నలిగిపోయేది. సింగరేణి వచ్చాక ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా మెరుగైన వేతనాలు, పని ప్రదేశాల్లో సౌకర్యాలు వచ్చాయి. దీంతో ఒకప్పుడు తెలంగాణ యువతకు ఉపాధి అంటే దుబాయి, బొంబాయి, బొగ్గుబాయి అనేంతగా ప్రాచుర్యం పొందింది. 90వ దశకం ఆరంభంలో సంస్థ వ్యాప్తంగా ఏకంగా 1.20 లక్షల మంది కార్మికులు పని చేసేవారు.


కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సండే స్పెషల్

తగ్గిన కార్మికులు..

1998 తర్వాత సంస్థలో యాంత్రీకరణ, ప్రైవేటీకరణ పెరగడంతో క్రమంగా కార్మికుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఉత్తర తెలంగాణలోని ఆరు జిల్లాల పరిధిలో 11 ఏరియాల్లో సింగరేణి సంస్థ విస్తరించి ఉంది. దీని పరిధిలో 22 భూగర్భగనులు (యూజీ), 18 ఉపరితల గనుల (ఓసీ) నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. సుమారు 28 వేల మంది యూజీల్లో, 11 వేల మంది ఓపెన్‌కాస్ట్ గనులు, ఇతర డిపార్ట్‌మెంట్లు, కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

థర్మల్ విద్యుత్‌కే సింహభాగం..

సింగరేణి సంస్థ ప్రతి ఏడాది ఉత్పత్తి చేసే బొగ్గులో 80 శాతం థర్మల్ విద్యుత్ సంస్థలకు సరఫరా చేస్తోంది. మిగతా 20 శాతం బొగ్గును సిమెంట్, స్పాంజ్ ఐరన్, పేపర్, సిరామిక్స్, ఆగ్రో, ఫార్మా తదితర పరిశ్రమలకు అందిస్తోంది. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన సుమారు రెండు వేలకు పైగా పరిశ్రమలు సింగరేణి నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటున్నాయి.

విస్తరణ బాటలో..

వందేళ్ల క్రితం బొగ్గు ఉత్పత్తితో మొదలైన సింగరేణి ప్రస్థానం ఇప్పుడు నలు దిశలా విస్తరిస్తోంది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో తొలి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సంస్థ ప్రారంభించింది. ఇప్పుడు జైపూర్ ప్లాంట్ విస్తరణతో పాటు రామగుండంలో రెండో ప్లాంట్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. దీంతో పాటు సోలార్ పవర్, విండ్ పవర్, బ్యాటరీ స్టోరేజ్ పవర్, పంప్డ్ స్టోరేజీ హైడల్ పవర్, ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ తదితర ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతోంది. ఓఎన్‌జీసీ సహకారంతో జియో థర్మల్ పవర్ ప్లాంట్ ప్రోటోటైప్ సిద్ధం చేస్తోంది. మరోవైపు ఒడిశాలో బొగ్గు ఉత్పత్తి, రాజస్థాన్‌లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది.

సంక్షేమంలో భేష్..

కార్మికుల సంక్షేమం కోసం సింగరేణి యాజమాన్యం ప్రతీ ఏడాది ఒక్కో కార్మికుడి కుటుంబంపై సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేస్తోంది. అంతేకాకుండా కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు సుమారు 150 కార్పొరేట్ ఆస్పత్రుల్లో సుమారు రూ.250 కోట్లు ఖర్చు చేసి వైద్య సౌకర్యం అందిస్తోంది. కార్మికుల పిల్లల కోసం ప్రత్యేకంగా విద్యా సంస్థలు నడిపిస్తోంది. వచ్చే ఏడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెడుతోంది. రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండా కార్మికులకు రూ.కోటి, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.30 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తోంది.


మ్యాన్‌రైడింగ్ ద్వారా గనిలోకి వెళ్తున్న కార్మికులు

భద్రతకు ప్రాధాన్యం



ప్రమాదకరమైన ప్రదేశాల్లో పని చేస్తూ కార్మికులు బొగ్గు ఉత్పత్తి చేస్తుంటారు. అందుకే కార్మిక రక్షణకు సింగరేణి ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగా తేలిక పాటి క్యాప్‌ల్యాంప్‌లు, అన్ని గనుల్లో ఎమర్జెన్సీ ఆప్పరేటర్లు అందుబాటులో ఉంచాం. వివిధ రకాల విష వాయువుల ఉనికి కనుగొనే ఆధునిక పరికరాలు సమకూర్చాం. ఆస్ట్రేలియాకు చెందిన సింటార్స్ అనే ప్రముఖ సంస్థ ద్వారా రక్షణపై ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాం. రూ.5 కోట్లతో సిమ్యూలేటర్ల ద్వారా భారీ యంత్రాల ఆపరేటర్లకు శిక్షణ ఇప్పిస్తున్నాం.

– సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఈఅండ్ఎం)

పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు వారధిగా ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు – న్యాయ సేవాధికార సంస్థలకు మధ్య వారధిగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. వలంటీర్లకు శనివారం నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థల విధులు, లక్ష్యాలను ప్రజలకు తెలియజేసి ఏ పౌరుడూ న్యాయాన్ని కోల్పోకుండా చూడాలని అన్నారు. ట్రైనర్లుగా నియమించిన న్యాయవాదులు వివిధ చట్టాల గురించి పారాలీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రామారావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, మారపాక రమేష్ కుమార్, పాండురంగా విటల్, సాదిక్ పాషా, నరేంద్ర బాబు, జీకే.అన్నపూర్ణ, మహాలక్ష్మి, ఎన్.ప్రతిభ, నాగస్రవంతి, మెండు రాజమల్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్


కమ్యూనిస్టు సిద్ధాంతమే శరణ్యం

- ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి
- బీజేపీ పాలనలో ఎస్టీ, ఎస్సీలకు తీవ్ర అన్యాయం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకట్
- ముగిసిన పార్టీ జిల్లా మహాసభలు


మహాసభలో మాట్లాడుతున్న వెంకట్

ఇల్లెందు : ప్రపంచమంతా కమ్యూనిస్టుల వైపు చూస్తోందని, కమ్యూనిజం సిద్ధాంతాలే ప్రజలకు శరణ్యంగా మారుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. ఇల్లెందులో జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభల్లో శనివారం ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రేణులు మిలిటెంట్ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కేరళ తరహాలో క్షేత్ర స్థాయి ఉద్యమాలకు నాంది పలికాలన్నారు. పార్టీ సభ్యులు, కుటుంబాలను నిర్లక్ష్యం చేయొద్దని నాయకులకు సూచించారు. యువతకు పాలకులు ఎన్నో వాగ్దానాలు చేశారని, వాటి అమలుకు ఉద్యమాలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో 20 శాతం మంది ఉన్న పెత్తందార్లు 80 శాతం మందిని అన్ని విధాలా దోపిడీ చేస్తున్నారని, వారిపై పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆచరణలో విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు మినహా మిగితావేవీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏ జిల్లాకు వెళ్లినా అక్కడి సీపీఎం నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని, ప్రజాపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. సభలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు, రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ మాట్లాడగా.. అన్నవరపు కనకయ్య నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం పార్టీ మహాసభల ముగింపు సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సభల్లో నాయకులు ఏజే రమేష్, పిట్టల రవి, బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, నబీ, శ్రీధర్, శ్రీను, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, కాళంగి హరికృష్ణ, బయ్యా అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యదర్శిగా మచ్చా..


మచ్చా వెంకటేశ్వర్లు

సీపీఎం జిల్లా నూతన కార్యదర్శిగా మచ్చా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, కొక్కెరపాటి పుల్లయ్య, ఎం. బాలనర్సారెడ్డి, మందలపు జ్యోతి, కారం పుల్లయ్య, కొలగాని బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్ కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. మరో 23 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు

ఓవరాల్ చాంపియన్‌గా
భద్రాద్రి, చార్మినార్, జోగులాంబ జోన్లు


ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన భద్రాద్రి జోన్ జట్టుతో కొత్వాల శ్రీనివాసరావు తదితరులు

పాల్వంచరూరల్ : లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీవీఎస్. పాపారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సంస్థ ఓఎస్డీ వివేకానంద, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు సాగిన పోటీలు విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపాయన్నారు. గురుకుల పాఠశాలలు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు ఆతిథ్యం ఇచ్చే అవకాశాన్ని పాల్వంచకు కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఓవరాల్ ఇన్‌చార్జ్ సట్ల శంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.శ్రీనివాస్, టెక్నికల్ మేనేజర్ కె.వాసు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, మల్టీజోన్ ఆఫీసర్ కె.అలివేలు, జోనల్ అధికారులు స్వరూపరాణి, విద్యారాణి, ఖమ్మం డీసీఓ రాజ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ అన్వేష్, ఎస్.నాగేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు కె.వెంకటేశ్వర్లు, కందాల లిల్లి, పద్మావతి, సునిత, రాజు, స్వరూపరాణి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

అండర్–14 విభాగంలో భద్రాద్రి సత్తా..

పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జోన్ల నుంచి హాజరైన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. అండర్ – 14 విభాగంలో భద్రాద్రి జోన్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. అండర్ – 17 విభాగంలో చార్మినార్ జోన్, అండర్ – 19 విభాగంలో జోగుళాబ గద్వాల్ జోన్ ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాయి. వ్యక్తిగత చాంపియన్ షిప్‌ను అండర్ – 14లో ఎం.నితిన్, అండర్– 17లో కె.మల్లేష్, అండర్ – 19 లో బి.భానుప్రసాద్ సాధించారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

- డీఈఓ వెంకటేశ్వరాచారి


బొమ్మనపల్లి పాఠశాలలో తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న డీఈఓ తదితరులు

టేకులపల్లి: పిల్లల బాధ్యత పూర్తిగా ఉపాధ్యాయులపైనే వదిలిపెట్టకుండా తల్లిదండ్రులు కూడా వారిపై శ్రద్ధ పెట్టాలని డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి అన్నారు. మండలంలోని సులానగర్ హైస్కూల్, బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులను ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల్లో చదివిస్తున్నామని, విద్యార్థులను సకాలంలో పంపించాలని కోరారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ పెడితేనే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, గతంలో కంటే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటిక, గణిత శాస్త్ర సామర్థ్యాల ప్రదర్శనను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు సైదులు, సతీష్, నాగరాజశేఖర్, ఎంఈఓ జగన్, హెచ్‌ఎంలు దేవదాసు, మంగీలాల్, శ్రీనివాసరావు, ఎం.జ్యోతిరాణితో పాటు విశాల్, గాయత్రి, నిహిత్, కార్తీక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మిక సంక్షేమమే బీఎంఎస్ లక్ష్యం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కార్మికుల సంక్షేమం, పరిశ్రమ ప్రగతి దేశాభివృద్ధే బీఎంఎస్ లక్ష్యమని సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్, జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్ పేర్కొన్నారు. శనివారం భారతీయ మజ్దూర్ సంఘ్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 22, 23 తేదీల్లో నిర్వహించే బీఎంఎస్ త్రైవార్షిక మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. బీఎంఎస్ నాయకులు కృష్ణారెడ్డి, టీఎస్ పవన్‌కుమార్, వెంకటరెడ్డి, మారేపల్లి శ్రీనివాస్, బి. సుందర్‌రావు, టి.నరేంద్రబాబు, ఏ.ఠాగూర్, అల్లి ప్రకాశ్, శివ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల నిరసన

జూలూరుపాడు/చంద్రుగొండ: టీచర్లు సమ్మె చేస్తుండటంతో ఎలాంటి తరగతులు జరగడం లేదని విద్యార్థినులు శుక్రవారం కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు నిరసన తెలిపారు. టీచర్లు తిరిగి విధుల్లో చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థినుల ఆందోళనకు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు రామ్‌చరణ్, అనిల్, బాలాజీ, సాయితేజ తదితరులు మద్దతు తెలిపారు.

కనకగిరి గుట్టలను సందర్శించిన అధికారులు



గుట్ట ఎక్కుతున్న డీఎఫ్ఓ విక్రమ్‌సింగ్ తదితరులు

చంద్రుగొండ: చంద్రుగొండ మండలం బెండాలపాడు శివారులో విస్తరించి ఉన్న కనకగిరి గుట్టలను ఖమ్మం డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్ శనివారం సందర్శించారు. గుట్టల పైభాగం వరకు వెళ్లిన ఆయన అక్కడి నుంచి ప్రకృతి అందాలను వీక్షించారు. అలాగే, గుట్టల పైభాగంలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులు, హస్తాల వీరన్నస్వామి ఆలయం నుంచి పులిగుండాల వరకు రహదారి నిర్మాణాన్ని పరిశీలించారు. డీఎఫ్ఓ వెంట తల్లాడ రేంజర్ ఉమ, డిప్యూటీ రేంజర్ సురేష్, బీట్ ఆఫీసర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

40 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం : మండలంలోని పెద్ద ఆర్లగూడెం శివారులో శనివారం రూ.10,06,250 విలువైన 40.25 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ అశోక్ కథనం ప్రకారం.. ఎస్ఐ గణేష్, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులను గమనించి అటుగా వస్తున్న కారును డ్రైవర్‌కు వెనకకు తిప్పాడు. వాహనం ఆగిపోవడంతో డ్రైవర్ దిగి పారిపోయాడు. పోలీసులు కారులో తనిఖీ చేయగా గంజాయి లభించింది. గంజాయి, కారును స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సామగ్రి దగ్ధం

పాల్వంచరూరల్: మండలంలోని యానంబైల్ గ్రామానికి చెందిన బుడగం నాగేశ్వరరావు ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లో సామగ్రి, రూ. 25 వేల నగదు దగ్ధమయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ హచ్యా పరిశీలించి పంచనామా నిర్వహించారు. రూ.1.25 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: దాడి ఘటనలో ఇద్దరు వ్యక్తులపై శనివారం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. పాత కక్షల నేపథ్యంలో బూడిదగడ్డ ఏరియాకు చెందిన ఎండి.షరుబుద్దీన్‌పై అదే ఏరియాకు చెందిన ఇమ్రాన్, షాకీర్‌లు కర్రతో దాడి చేయగా తల పగిలింది. దీంతో స్థానికులు షరుబుద్దీన్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'వందశాతం' సాధించాలి

దుమ్ముగూడెం : పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాంధించాలని ట్రైబల్ వేల్ఫేర్ డీడీ మణెమ్మ సూచించారు. శనివారం ఆర్లగూడెం ఏహెచ్ఎస్ పాఠశాలలో ఆమె తనిఖీ చేశారు. మెనూ అమలు తీరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. హెచ్ఎం కారం సోమశేఖర్, వార్డెన్ వసంతం పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాలకు సిద్ధం

- పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 50 ఏళ్లు
- కాలేజీ నాటి ప్రాభవం కోల్పోయి సమస్యలతో సహవాసం

పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలకు సిద్ధమైంది. కాలేజీని స్థాపించి 50 ఏళ్లు కావడంతో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నారు. అర్ధశతాబ్ద కాలంలో ఇక్కడ చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ పలువురు పూర్వవిద్యార్థులు ఈ వేడుకకు తరలిరానున్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే కళాశాల ప్రాభవం కోల్పోయి సమస్యలతో సతమతమవుతోంది. –పాల్వంచరూరల్



ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుత భవనం

ఏపీఎస్ఈబీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను పాల్వంచ పట్టణంలోని యాష్ కాలనీలో కేటీపీఎస్ ఆధ్వర్యంలో నిర్మించారు. 1974, జనవరి 15న అప్పటి సీఎం జలగం వెంగళరావు, అప్పటి విద్యాశాఖమంత్రి మండలి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే చేకూరి కాశయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఇంటర్మీడియట్ ఆర్ట్స్, సైన్స్ గ్రూపులతోపాటు ఒకేషనల్ కోర్సులు కూడా నిర్వహించారు. దాదాపు 2010వరకు ఏటా ఆరు, ఏడు వందల మంది విద్యార్థులు చదువుకునేవారు. పాల్వంచతోపాటు చుట్టుపక్కల మండలాల విద్యార్థులందరూ ఇదే కళాశాలకు వచ్చేవారు. 90 దశకం నుంచి ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నా ఎక్కువ మంది ప్రభుత్వ కళాశాలలో చేరేందుకే మక్కువ చూపేవారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ఇక్కడి విద్యార్థులు ఫలితాలు సాధించేవారు. మెరిట్ ఉంటే తప్ప కళాశాలలో సీటు దొరకని పరిస్థితి కూడా ఉండేది.

ఇక్కడి పూర్వ విద్యార్థులు ఐఏఎస్‌లు, ఎన్ఆర్ఐలుగా..

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దింది. ఇక్కడ చదువుకున్న చంపలాల్, భారతి నాయక్ ఐఏఎస్‌లుగా ఎదిగారు. గిరిధర్ ఐఎఫ్ఎస్ అధికారిగా పనిచేస్తున్నారు. ఇంకా అనేకమంది ఎన్ఆర్ఐలు ఉన్నారు. జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో పలువురు ఈ కళాశాల పూర్వ విద్యార్థులే.

ప్రస్తుతం వేధిస్తున్న సమస్యలు

ప్రస్తుతం కళాశాలను సమస్యలు పీడిస్తున్నాయి. గతంలో సుమారు 13 ఎకరాల విస్తీర్ణంలో 30 గదులతో కళాశాల భవనం ఉండేది. ప్రస్తుతం 8 గదులతో 1.10 ఎకరాల స్థలంతో కళాశాల కొనసాగుతోంది. ఇందులో రెండు గదులు ప్రిన్సిపాల్‌కు, స్టాఫ్‌నకు కేటాయించగా, మిగిలిన ఆరు గదుల్లోనే ఆర్ట్స్, సైన్స్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. మరో రెండెకరాల స్థలం కేటాయించినా భవనాలు నిర్మించలేదు. తగిన సంఖ్యలో తరగతి గదులు లేకపోవడంతో క్లాస్ రూమ్‌లనే ల్యాబ్‌లుగా ఉపయోగించుకుంటున్నారు. ల్యాబ్ సామగ్రి వరండాలో ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. క్రీడా మైదానం కూడా లేకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కేటీపీఎస్ యాజమాన్యం స్పందించి కళాశాలలో అదనపు తరగతి గదులు, ల్యాబ్స్, క్రీడామైదానం నిర్మించాలని విద్యార్థులు, అధ్యాపకులు వేడుకుంటున్నారు. ఉన్నతస్థాయిలో స్థిరపడ్డ పూర్వవిద్యార్థులు కూడా సహకరించాలని కోరుతున్నారు.

నేడు వేడుకలు

నేడు (ఆదివారం) స్వర్ణోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ముఖ్యఅతిథులుగా ఖమ్మం ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ బి.రోహిత్‌రాజ్, డీఐఈఓ వెంకటేశ్వరరావు హాజరవుతారని ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు.

కేటీపీఎస్ ఏడో దశ కోసం భవనం కూల్చివేత



కేటీపీఎస్ కర్మాగారం కోసం కూల్చివేసిన కళాశాల భవనం

ఇంతటి ప్రాశస్త్యం కలిగిన జూనియర్ కళాశాలను ఏడో దశ కర్మాగారం ఏర్పాటు కోసం పదేళ్ల క్రితం కేటీపీఎస్ యాజమాన్యం కూల్చివేసింది. మరో చోట స్థలం సేకరించకుండా చెక్కు చెదరని భవనాన్ని నేలకూల్చి ఆ పునాదులపై కర్మాగారం నిర్మించింది. ఆ తర్వాత పాల్వంచ మండలం బస్వతారాక కాలనీ గ్రామపంచాయతీలో ప్రస్తుతం ఉన్న భవనాన్ని నిర్మించింది. 2014 వరకు కళాశాల యాష్ కాలనీలో కొనసాగగా, కొత్త భవన నిర్మాణ సమయంలో 2014 నుంచి 2015 వరకు లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో తాత్కాలికంగా కొనసాగించారు. 2016 జనవరిలో సొంత భవనంలోకి తరలించారు. ప్రస్తుతం కళాశాలలో 420 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.

లెక్కల చిక్కుముడులు విప్పేలా..

గణితఫోరం ఆధ్వర్యాన పోటీలు, ఉపాధ్యాయులకు శిక్షణ

- ఏటా మండల స్థాయి మొదలు రాష్ట్ర స్థాయి వరకు పోటీలు
- విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా నిర్వహణ
- నేడు శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవం

ఖమ్మంసహకారనగర్: అందరి దైనందిన జీవితంలో గణితంతో విడదీయరాని అనుబంధం ఉంటుంది. నిద్ర లేచించి మొదలు రాత్రి వరకు అన్ని అంశాలు గణితంతో ముడిపడి ఉంటాయి. కానీ పాఠశాల స్థాయిలో కొందరు విద్యార్థులు భయంతో గణితంలో వెనుకబడుతుంటారు. ఈనేపథ్యాన వారిలో భయాన్ని పోగొట్టి సులభ సూత్రాల ద్వారా బోధించేందుకు ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇస్తూనే.. విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా ఏటా తెలంగాణ మ్యాథ్స్ ఫోరం(టీఎంఎఫ్) ఆధ్వర్యాన మండలం మొదలు రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహిస్తున్నారు. 2016లో మొదలైన ఈ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు పలువురు రాష్ట్ర స్థాయికి ఎంపికై సత్తా చాటుతున్నారు. గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఏటా డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యాన జిల్లాలో టీఎంఎఫ్ కార్యకలాపాలపై కథనం.

విద్యార్థులు పట్టు సాధించేలా..

ఇంగ్లిష్‌తోపాటు గణితానికి నిత్య జీవితంలో ఎంతో ప్రాధాన్యత ఉంది. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే గణితంపై పట్టు అవసరం. బ్యాంక్ ఉద్యోగాలు, సీఏ, ఆర్ఆర్‌బీ తదితర పోటీ పరీక్షల్లో గణితంలో అత్యధిక మార్కులు సాధించడమే కీలకం. దీంతో హైస్కూల్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఈ సబ్జెక్టుపై ఆసక్తి పెంచేలా టీఎంఎఫ్ కృషిచేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనే ఉద్దేశంతో ఏటా పరీక్షలు నిర్వహిస్తుండడంతో పాటు ఉపాధ్యాయులకు కూడా అవగాహన పెంచేలా కృషి చేస్తోంది.

నవంబర్ నుంచి ప్రారంభమై..

ఈ ఏడాది నవంబర్ 24న మండల స్థాయిలో పోటీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అక్కడ విజయం సాధించిన విద్యార్థులకు ఈనెల 11న జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించగా రాష్ట్ర స్థాయి పరీక్ష ఆదివారం హైదరాబాద్‌లో జరగనుంది. జిల్లా నుంచి ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

శరత్‌చంద్ర.. గణితంపై మక్కువ



అవార్డులు అందుకున్న విద్యార్థులతో శరత్‌చంద్ర (ఫైల్)

ఇల్లెందు: సాస్మో – 2024 పేరిట నిర్వహించిన ఒలింపియాడ్‌లో ఇల్లెందు సుభాష్‌నగర్‌కు చెందిన మోకాళ్ల శరత్ చంద్ర ప్రతిభ కనబరిచాడు. శరత్ ప్రస్తుతం హైదరాబాద్‌లో చదువుతుండగా గణితంపై మక్కువతో పలు పరీక్షల్లో సత్తా చాటాడు. ఇందులో భాగంగా ఆయన సింగపూర్ ఏసియన్ మాథ్స్ ఒలింపియాడ్(సాస్మో)లో పాల్గొనగా బంగారు పతకం లభించింది. అమెరికన్ మేథమెటిక్స్ కాంపిటీషన్, బిట్స్ పిలానీ ఇన్ఫినిటీ, అసోసియేషన్ ఆఫ్ మ్యాథమెటిక్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జరిగిన పోటీల్లో కూడా శరత్ పతకాలు గెలుచుకున్నాడు.

రాష్ట్ర స్థాయిలో జిల్లా విద్యార్థులు..



ఎగ్జిబిట్‌తో అమృత

కొత్తగూడెంఅర్బన్: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌లో జిల్లా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు న్యాయనిర్ణేతల మన్ననలు అందుకున్నాయి. అన్నపురెడ్డిపల్లిలోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన బి.అమృత మ్యూజికల్ పార్క్, పాల్వంచ జగన్నాథపురం హైస్కూల్‌కు చెందిన డి.విజయనాయక్ బహుళార్థక గణిత ఫజిల్, పాల్వంచ త్రివేణి పాఠశాల విద్యార్థిని పి.సాయిలోహిత పైథాగరస్ థియరీని ఎన్ని విధాలుగా ఉపయోగించవచ్చో వివరించారు. ఎగిబిట్లు సైన్స్‌ఫేర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పోటీల్లో సత్తా చాటుతున్న 'నవభారత్'



ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీచైత్ర

పాల్వంచ: పాల్వంచలోని నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి గణిత ఒలంపియాడ్‌లో సత్తా చాటారు. ఏటా నిర్వహించే సీఆర్.రావు స్టాటిస్టిక్స్ ఒలింపియాడ్‌లోనూ ప్రతిభ చూపారు. పదో తరగతి విద్యార్థులు బోయపాటి శ్రీచైత్ర, నాగసాయి కృష్ణతేజ వరుసగా రెండు, నాలుగో స్థానంలో నిలవగా పద్మవిభూషణ్ సీఆర్.రావు జయంతి అయిన సెప్టెంబర్ 10న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో యూనివర్సిటీ వీసీ ఎంఎస్.రావు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఇక హైదరాబాద్ రామాంతపూర్‌లో ఇటీవల నిర్వహించిన రీజనల్‌స్థాయి గణిత ప్రదర్శనలో నవభారత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 8వ తరగతి విద్యార్థులు డి.మనస్వి, బి.కార్తీక ఈ ప్రదర్శనలో బాస్కెట్ బాల్ ఆటలో గణిత సూత్రం అమలుపై ఎగ్జిబిట్ సమర్పించగా ప్రథమ బహుమతి లభించింది. అలాగే, ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన జాతీయస్థాయి ఆర్యభట్ట గణిత చాలెంజ్ పరీక్షలో ఎం.డీ.ముద్దీర్, బి.షాస్‌ముఖ్, టి.జోషిత మొదటి మూడు స్థానాల్లో నిలవగా.. నేషనల్ మ్యాథ్ ఫెయిర్ బెస్ట్ కోచ్‌గా వీరబ్రహ్మేందర్ అవార్డు అందుకున్నారు.

ముక్కోటి పనులు సకాలంలో పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్ రావు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వచ్చే నెల 9, 10 తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీఓ దామోదర్ రావు అన్నారు. శనివారం భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో ఉత్సవాల నిర్వహణపై డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 6వ తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖ సమన్వయంతో బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. లాడ్జి, హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించి ధరలు నిర్ణయించామన్నారు. భద్రాచలం, పర్ణశాల దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని, ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. హంస వాహనాన్ని తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్ణశాల, భద్రాచలంలో మొబైల్ టీమ్‌లు, అంబులెన్సులు, ఏరియా ఆస్పత్రిలో పది బెడ్లు, సరిపడా మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎవరైనా భక్తులు గుండెపోటుకు గురైతే సీపీఆర్ చేసేలా పోలీస్, గ్రామపంచాయతీ సిబ్బందికి ఈ నెల 27న ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఇన్‌చార్జ్ ఏఎస్పీ రవీందర్ రెడ్డి, ఈఓ రమాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక

టేకులపల్లి: విద్యుత్ శాఖ భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ రీజినల్ గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా టేకులపల్లి విద్యుత్ ఏఈ హట్కర్ దేవా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో ఎన్నికలు నిర్వహించినట్లు శనివారం వారు తెలిపారు. రీజినల్ గౌరవ అధ్యక్షుడి కోటేశ్వరరావు , కార్యదర్శిగా ఆదినారాయణ, గౌరవ సలహాదారులుగా కిరణ్ కుమార్, రాంబాబు, వెంకట్ రామ్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా రామకృష్ణ , కిషన్ , శంకర్, కోశాధికారిగా గౌతమ్, మహిళా ప్రతినిధిగా చంద్రకళ, డివిజన్ కార్యదర్శిగా బి.రవి, అధ్యక్షుడిగా జె.రాజేందర్‌నాయక్, కోశాధికారిగా కిషన్, భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా వెంకన్న ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా ఏడీఈ రాందాస్, ఎల్ఐ ఉపేందర్ వ్యవహరించారు.

బొడ్రాయి పండుగకు వస్తూ మృత్యు ఒడిలోకి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి, చెల్లెళ్లకు గాయాలు



సాయిరాం(ఫైల్)

అశ్వాపురం: బొడ్రాయి పండుగకు వస్తూ శనివారం ఓ యువకుడు మృత్యుఒడిలోకి వెళ్లాడు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రానికి చెందిన అలవాల సాయిరాం(25) అశ్వాపురం మండలం చింతిర్యాల కాలనీలోని తన బాబాయి ఇంటికి బొడ్రాయి పండుగకు బైక్‌పై చెల్లెళ్లు మోక్షజ్ఞ, తపస్వితో కలిసి వస్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో కాలనీ వద్ద రహదారి గుంతలుగా ఉండటంతో మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురికీ గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న అశ్వాపురం వైద్యాధికారి సంకీర్తన యువకుడికి సీపీఆర్ చేసింది. కానీ తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలైన ఇద్దరి చెల్లెళ్లను భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మణుగూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేట: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను అశ్వారావుపేట పోలీసులు శనివారం తహశీల్దార్ చల్లా ప్రసాద్‌కు స్వాధీన పరిచారు. అయితే నామమాత్రపు ఫైన్ విధించి వదిలేయడంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పశువుల వాహనం పట్టివేత

పాల్వంచరూరల్: మండల పరిధిలోని బీసీఎం ప్రధాన రహదారిపై సోములగూడెం క్రాస్ రోడ్డు వద్ద శనివారం భద్రాచలం నుంచి పాల్వంచవైపు వస్తున్న పశువుల వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. 11 పశువులను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించారు. వాహనం డ్రైవర్ పారిపోగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొండా వీరయ్య శనివారం తాటి చెట్టుపై నుంచి గాయపడ్డాడు. కాళ్లు విరగడంతో స్థానికులు చికిత్స నిమిత్తం భద్రాచలంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పంచాయతీ కార్మికుడి మృతి

సుజాతనగర్: మండల పరిధిలోని సీతంపేట బంజర గ్రామానికి చెందిన బానోత్ వేణు (36) పదిహేనేళ్లుగా పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 6 నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్యం క్షీణించడంతో మనోవేదనతో ఈ నెల 19న పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాదేవి తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

అశ్వారావుపేట: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. అశ్వారావుపేట సీఐ టి.కరుణాకర్ కథనం ప్రకారం.. ఎస్ఐ యయాతి రాజు, సిబ్బంది జంగారెడ్డిగూడెం రోడ్‌లో సాయిబాబా ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బైక్‌పై వస్తున్న ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా యాదవోలు గ్రామానికి చెందిన మారం మునియ పోలీసులను చూసి తడబడ్డాడు. బైక్ వెనక్కు మళ్లిస్తుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. దీంతో ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్నట్లు అంగీకరించాడు. చోరీ కేసుల్లో గతంలో రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష కూడా అనుభవించాడు. బయటికొచ్చాక మళ్లీ చోరీలు చేస్తున్నాడు. ఏపీ, తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో 8 ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, ఓ వాహనాన్ని అమ్మేందుకు తీసుకొస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు. కాగా మునియపై 61 ద్విచక్ర వాహన చోరీ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



తండ్రికి బాలుడిని అప్పగిస్తున్న ఎస్సై, సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: ఓ మూడేళ్ల బాలుడు తప్పిపోగా, ఫిర్యాదు అందుకున్న గంటల వ్యవధిలోనే పోలీ సులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. మండలంలోని జమ్మిగూడేనికి చెందిన దానపోలు వీరాజ్ అనే మూడేళ్ల బాలుడిని ఏపీలోని చింతలపూడి మండలం కంద్రికగూడేనికి తన తాతయ్య తాళ్ల వెంకటేష్ మద్యం మత్తులో శుక్రవారం మధ్యాహ్నం చెప్పకుండా తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో వదిలేసి వెళ్లాడు. బాలుడు లేకపోవడంతో ఆందోళన చెందిన తండ్రి మంగరాజు పలుచోట్ల వెతికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన ఎస్ఐ యయాతి రాజు, సిబ్బంది విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తూ పరిసర గ్రామాలను అప్రమత్తం చేయగా, బాలుడు పాకలగూడెంలో ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు చిన్నారిని తీసుకొచ్చి శనివారం సాయంత్రం తండ్రికి అప్పగించారు.

బస్సులో బంగారం చోరీ.. రికవరీ

అశ్వాపురం: ఆర్టీసీ మణుగూరు డిపోకు చెందిన పల్లెవెలుగు హైర్ బస్సు శనివారం రాత్రి భద్రాచలం నుంచి మణుగూరు బయలుదేరుతుండగా అశ్వాపురం మండలం జగ్గారం గ్రామానికి చెందిన మహిళ బ్యాగులో నుంచి పది తులాల బంగారం పోయింది. దీంతో ఆమె డ్రైవర్, కండక్టర్‌కు తెలపడంతో బస్సును బస్టాండ్‌లోనే ఆపి ప్రయాణికులందరినీ తనిఖీ చేశారు. ఓ మహిళ తప్పించుకుని పోతుండగా డ్రైవర్ కోటేశ్వరరావు గమనించి ఆమె బ్యాగ్‌లో పరిశీలించగా బంగారం దొరికింది. దీంతో బాధిత మహిళకు అప్పగించారు. అనంతరం చోరీకి పాల్పడ్డ మహిళను పోలీసులకు అప్పగించగా డ్రైవర్‌ను అభినందించారు.



తిరుపతిలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో వైఎస్ జగన్ చిత్రపటాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో నల్లమల అభయారణ్యంలోని మారుమూల గిరి జన గూడెం పాలుట్లలో జగన్ జన్మదినం సందర్భంగా ఆనందంతో నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో వసతి గృహ విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ సమన్వయ కర్త పేరాడ తిలక్ తదితరులు

ఊరూవాడా సంబరాలు

ఘనంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు

సాక్షి, అమరావతి: అభివృద్ధి, సంక్షేమ సారథి, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఏపీ వ్యాప్తంగా ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు సంబరాలు చేసుకొన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు 26 జిల్లాల్లో ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేశారు. వీధులు, కూడళ్లలో వైఎస్ జగన్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. యువత ర్యాలీలు చేశారు. పేదలు, అనాథలకు వస్త్ర దానాలు చేశారు. భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వైఎస్ జగన్ అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లండ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా 14 దేశాల్లోనూ జగన్ జన్మదిన వేడుకలను అభిమానులు వైభవంగా నిర్వహించారు.

కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధం

- ఓయూ కృతజ్ఞత సభలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



అభివాదం చేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ-కార్ రేసు కుంభకుణంలో మాజీ మంత్రి కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంపదను దోచుకుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. ఇక నుంచి జాబ్ క్యాలెండర్ ప్రకారం ఏటా ఉద్యోగాల భర్తీ జరుగుతుందన్నారు. శనివారం ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి, పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్ అధ్యక్షత వహించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్‌ఎస్ చేయని అభివృద్ధిని ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఓయూకు విచ్చేసి ఇక్కడి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా.రియాజ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు మెడ శ్రీను పాల్గొన్నారు.

మంత్రులు వేస్ట్.. కాదు కాదు పాలన వేస్ట్

అమాత్యుల పనితీరు మీద ఏపీ సీఎం సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: ఆరునెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా చేయించుకున్న సర్వేలోనూ అదే విషయం వెల్లడి కావడం అధికార పార్టీ వర్గాలను తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. పాలనను ప్రతిబింబించే మంత్రుల పనితీరు మీద ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల సర్వే చేయించి వారికి ర్యాంకింగ్ ఇచ్చారు. ఇదే విషయాన్ని సీఎం స్వయంగా కేబినెట్ సమావేశంలో మంత్రులకు వెల్లడించారు. తాజాగా.. మంత్రుల పనితీరు మీద ర్యాంకులు ఇచ్చిన నివేదికను ప్రభుత్వ పెద్దలు లీక్ చేశారు. కేవలం ఆరుగురు మంత్రుల పనితీరు మాత్రమే సంతృప్తికంగా ఉందని, మిగతా 18 మంది ర్యాంకులు అధ్వానంగా ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది. సహజంగా.. ప్రభుత్వ పాలన తీరుకు మంత్రివర్గం పనితీరును గీటురాయిగా తీసుకుంటారు. మంత్రివర్గంలో 75 శాతం మంది సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని, సర్వేలో ర్యాంకులు అధ్వానంగా రావడం మంచి పరిణామం కాదని అధికార పార్టీ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ర్యాంకులు మరీ అధ్వానంగా ఉన్న మంత్రుల జాబితాలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, సీఎం కుమారుడు లోకేశ్ కూడా ఉండటం గమనార్హం. ప్రభుత్వానికి అన్నీ తామై వ్యవహరిస్తున్న ఈ ఇద్దరి పనితీరు, ప్రభుత్వ పనితీరును వేరుచేసి చూడలేమని, సీఎం చేయించిన సర్వేలో తేలిన విషయమే ప్రజల్లోనూ స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఒక్క హామీని కూడా అమలుచేయకుండా కబుర్లతో కాలక్షేపం చేస్తున్న తీరును ప్రజలు గుర్తించారు. ప్రజాసంక్షేమం దిశగా ప్రభుత్వం ఏమీచేయలేక చేతులెత్తేసిన విధానమే మంత్రుల పనితీరు మీద ప్రతిబింబించిందనే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించకుండా, 'అధ్వాన్న పనితీరు' పేరిట తమను నిందించడంలో అర్థంలేదని మంత్రులు తమ సన్నిహితుల దగ్గర వాపోతున్న విషయం అధికార పార్టీ వర్గాలకు తెలుసు. పైపెచ్చు.. లోకేశ్ అన్ని మంత్రిత్వ శాఖల్లో జోక్యం చేసుకుంటే తాము చేయడానికి ఏముంటుందని.. తమ చేతులు కట్టేసి తాము అసమర్థులమని సర్వేల్లో తేల్చి ర్యాంకింగ్ ఇవ్వడం ఏమిటని మంత్రులు ప్రశ్నిస్తున్నారు.

పవన్ పనితీరుపైనా అసంతృప్తి..

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పనితీరు అంత బాగోలేదని నివేదిక తేల్చడమంటే.. అన్ని శాఖల కంటే అత్యధిక బడ్జెట్ ఉన్న పంచాయతీరాజ్ శాఖను ఇచ్చినా ఆయన అందుకు తగ్గ రీతిలో పనిచేయడంలేదని, అంటే ప్రభుత్వ పనితీరు అధ్వానంగా ఉందనే అర్థమని పరిశీలకులు చెబుతున్నారు. హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడమే మంత్రుల ర్యాంకింగ్ అడ్డంపడుతోందని, అది కేవలం పవన్‌కళ్యాణ్ ఒక్కడి వ్యక్తిగత సామర్థ్యం తక్కువనే భావన కాదని జనసేన వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు తనయుడు లోకేశ్ నిర్వహిస్తున్న కీలకమైన మానవవనరుల (విద్యా శాఖలు) శాఖలో అన్నీ సమస్యలే ఉండడంతో ఆయన పనితీరుపైనా పెదవి విరుస్తున్నారు.

పెత్తనం లోకేశ్‌ది.. తిట్లు మాకా!?

ఈ ర్యాంకింగ్‌లపై మంత్రులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. చంద్రబాబు ఏ ప్రాతిపదికన తమ పనితీరు అంచనా వేశారో తెలీడంలేదని సీనియర్ మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రాంనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు వంటి నేతలు ఆగ్రహంతో రగిలిపోతున్నట్లు సమాచారం. ప్రభుత్వంలోని అన్ని వ్యవహారాల్లో లోకేశ్ తలదూరుస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇక తమకు పనిచేయడానికి అవకాశమెక్కడ ఉందని వారు ప్రశ్నిస్తున్నారు.

పనిచేసేది ఈ ఆరుగురే..

ఇక రాష్ట్ర కేబినెట్‌లో ఆరుగురు మంత్రులు మాత్రమే బాగా పనిచేస్తున్నట్లు నివేదిక తేల్చింది. అందులో మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ ముందున్నారు. అలాగే..

- విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎంఎస్‌ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా బాగా పని చేస్తున్నారని మంచి ర్యాంకింగ్ దక్కింది.
- కూటమిలో జనసేన పార్టీ తరఫున మంత్రిగా ఉన్న నాదెండ్ల మనోహర్, బీజేపీ తరఫున మంత్రిగా ఉన్న సత్యకుమార్ పనితీరు కూడా బాగుందని నివేదిక పేర్కొంది.

రేపు కేటీఆర్‌కు ఈడీ నోటీసులు?

- అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డిలకు కూడా ఇచ్చే అవకాశం
- ఫార్ములా-ఈ కార్ల రేసు కేసులో చర్యలకు సిద్ధం
- బ్యాంకు అధికారుల నుంచి వివరాలు సేకరించనున్న ఈడీ

సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా-ఈ'కార్ల రేసు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఏసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా 'ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)'ను నమోదు చేసిన ఈడీ అధికారులు ఈ కేసులో ప్రధాన నిందితులకు సమన్లు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఏ-2గా ఉన్న పురపాలకశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, ఏ-3గా ఉన్న హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డికి ఈడీ సోమవారం సమన్లు జారీ చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే ఏసీబీ నుంచి ఫార్ములా-ఈ కారు రేసు ఒప్పందాలకు సంబంధించి సేకరించిన పత్రాలు, ఎఫ్ఐఆర్‌తోపాటు బ్యాంకు లావాదేవీలను ఈడీ అధికారులు పరిశీలించారు. హెచ్‌ఎండీఏ సాధారణ నిధుల నుంచి యూకేకు చెందిన 'ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ)'కు రూ.45,71,60,625 సొమ్మును విదేశీ కరెన్సీలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ద్వారా బదిలీ చేశారు. దీంతో సదరు బ్యాంకు అధికారుల వాంగ్మూలాలను ఈడీ అధికారులు నమోదు చేయనున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకు అధికారులను సైతం ప్రశ్నించనున్నారు. ఓవైపు ఈ కేసులో ఈడీ అధికారులు వేగం పెంచగా మరోవైపు తెలంగాణ ఏసీబీ సైతం కీలకాంశాలపై దర్యాప్తు ముమ్మరం చేసింది. కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్టు చేయొద్దని.. కానీ దర్యాప్తు కొనసాగించుకోవచ్చని హైకోర్టు ఆదేశించడంతో ఆధారాల సేకరణపై ఏసీబీ దృష్టి పెట్టింది. తొలుత హెచ్‌ఎండీఏ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ వాంగ్మూలం నమోదుతో దర్యాప్తు ప్రక్రియ ప్రారంభించనుంది. ఈడీ, ఏసీబీ దర్యాప్తులో ఏ విషయాలు వెలుగులోకి వస్తాయనేది ఆసక్తికరంగా మారింది. ఏసీబీ సేకరించే పత్రాలు ఈడీకి ఉపయోగపడినట్లే ఈడీ దర్యాప్తులో మనీలాండరింగ్ కోణంలో ఏవైనా ఆధారాలు లభిస్తే ఈ కేసు మరో మలుపు తిరుగుతుందన్న చర్చ నడుస్తోంది.

అభినందన 'పత్రం'

రావి ఆకుపై మాజీ సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు



నారాయణఖేడ్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఖేడ్‌కు చెందిన ప్రముఖ పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకులపై చిత్రాలు మలిచారు. ప్రముఖుల జన్మదినోత్సవాలు, ఆయా పండుగలు, ప్రాధాన్యాలపై లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ చిత్రాలు వేస్తూ విశిష్టతను తెలియపరుస్తుంటారు. ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలను కూడా రావి ఆకులపై మలచి వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు.


జిల్లా వార్తలు

నేడు అండర్-17 బాలికల క్రికెట్ జట్టు ఎంపిక



ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అండర్ -17 బాలికల క్రికెట్ జట్టును ఎంపిక చేసేందుకు ఆదివారం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శులు కె.నర్సింహామూర్తి, వి.నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణపత్రాలతో పాటు ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. 2008 తర్వాత జన్మించిన వారు ఎస్సెస్సీ మెమో, స్టడీ సర్టిఫికెట్లతో ఆదివారం ఉదయం 9గంటలకల్లా రిపోర్టు చేయాలని తెలిపారు.

సొంతింటి పథకంపై ప్రకటన చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డే వేడుకల్లో పాల్గొననున్న సీఎండీ బలరామ్ ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల స్వంతింటి పథకంపై ప్రకటన చేయాలని హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ కోరారు. కొత్తగూడెంలో శనివారం జరిగిన యూనియన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థలో సుమారు 40వేల కార్మికులు పనిచేస్తుండగా, 60 వేల క్వార్టర్లు ఉన్నాయని తెలిపారు. ఇందులో చాలావరకు ఎవరి ఆధీనంలో ఉన్నాయన్న వివరాలు ఎవరూ చెప్పలేకపోతున్నారని చెప్పారు. ఇకనైనా శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లను సీనియారిటీ ప్రకారం నివాసముంటున్న వారికే కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే కార్మికులకు 240 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షలు ఇచ్చే విషయమై సింగరేణి డే వేడుకల్లో ప్రకటన చేయాలని కోరారు. కాగా, ఉత్తమ కార్మికుల ఎంపికలో కష్టపడిన వారికి కాకుండా గుర్తింపు సంఘం చెప్పిన కార్మికుల పేర్లు ప్రకటించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఆంజనేయులు, ఆసిఫ్, తిప్పారపు సారయ్య, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భగనుల్లో నష్టాల పరంపర

- నివారణపై సింగరేణి అధికారుల దృష్టి
- యంత్రాల పనిగంటలు పెంచడంపై ఆదేశాలు
- అందరూ 8గంటల పాటు పనిచేస్తేనే లక్ష్య సాధన



భూగర్భగనుల్లో బొగ్గు ఉత్పత్తి చేసే ఎస్‌డీఎల్ యంత్రం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం మేరకు జరుగుతున్నా భూగర్భ గనుల్లో అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఏళ్ల తరబడి భూగర్భగనుల్లో ఆశించిన మేరకు ఉత్పత్తి నమోదు కాక నష్టాలు ఎదురవుతుండగా యాజమాన్యం నష్టనివారణ చర్యలపై దృష్టి సారించింది. ప్రతీ టన్ను బొగ్గు ఉత్పత్తికి అంతా కలిపి రూ.9వేల వరకు వ్యయం అవుతుండగా, మార్కెట్‌లో రూ.3,500కు మించి రావడం లేదు. ఫలితంగా దాదాపు రూ.5,500 మేర ప్రతీ టన్నుకు నష్టం వాటిల్లుతోంది. సింగరేణి వ్యాప్తంగా 22 భూగర్భగనుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గడిచిన ఐదేళ్లలో భూగర్భ గనుల ద్వారా 3,55.65 లక్షల టన్నుల ఉత్పత్తి చేయగా, రూ.14,198 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా.

ఉత్పత్తి పెరిగితేనే తగ్గనున్న నష్టాలు

2024-25 ఆర్థిక సంవత్సరం నవంబర్ వరకు భూగర్భగనుల్లో 4,83,500 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 3,76,471 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి(78 శాతం) నమోదైంది. ఈ లెక్కల ప్రకారం ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మరో 28.14 టన్నులు సాధిస్తే, టన్నుకు రూ.8,820 వ్యయమవుతుందని అంచనా. ఈ బొగ్గును రూ.4,892 చొప్పున అమ్మగలిగినా టన్నుకు రూ.3,928 నష్టం వస్తుంది. మొత్తంగా సంస్థకు రూ.1,105 కోట్ల నష్టం ఎదురయ్యే అవకాశముంది. దీన్ని సరిదిద్దేలా కంపెనీ నిర్దేశించిన లక్ష్యం మేరకు 4,83,500 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించగలిగితే టన్ను వ్యయం రూ.7,770కు తగ్గి, నష్టం కూడా టన్నుకు రూ.2,916, మొత్తంగా రూ.985 కోట్లకు తగ్గుతుందని భావిస్తున్నారు.

ఎస్‌డీఎల్ పనిగంటలు పెంచితే..

సింగరేణిలోని 22 భూగర్భగనుల్లో 16 గనుల్లోనే ఎస్‌డీఎల్ యంత్రాలు పనిచేస్తున్నాయి. ఇవి రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తే రోజుకు ఒక్కో యంత్రం 142 టన్నుల ఉత్పత్తి చేయగలుగుతాయి. కానీ ప్రస్తుతం ఆరు గంటలే పనిచేస్తుండడంతో ఉత్పత్తి ఆశించిన మేర సాగడం లేదు. ఈనేపథ్యాన యంత్రాలతో మరో రెండు గంటలు పనిచేయిస్తే రోజుకు 142 టన్నుల ఉత్పత్తి నమోదవుతుంది. అలాగే, ఉద్యోగులు, సిబ్బంది సైతం ఎనిమిది గంటల పాటు పనిచేస్తేనే నష్టనివారణ సాధ్యమవుతుందని చెబుతున్నారు.

స్థితిగతులను వివరించేందుకు సమావేశాలు..



ఉత్పత్తి వ్యయం తగ్గించడం, బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఉత్పాదకతను పెంచడంతో పాటు ప్రస్తుత స్థితిగతులను వివరించేందుకు మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాలు నిర్వహించాం. సంస్థ ఉద్యోగులంతా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించాం. గత అక్టోబర్‌లో నిర్వహించిన సహపంక్తి భోజనాల ద్వారా కార్మికుల్లో కొంత మార్పు కనిపించింది. మళ్లీ ఇప్పుడు మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాల ద్వారా ఇంకొంత మార్పు వస్తుందని ఆశిస్తున్నాం. – శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

గత ఐదేళ్లలో భూగర్భగనుల్లో ఉత్పత్తి, నష్టాల వివరాలు

ఏడాది	భూగర్భ గనుల్లో ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)	ఉత్పత్తి వ్యయం (టన్నుకు రూ.ల్లో)	అమ్మకం ధర (టన్నుకు రూ.ల్లో)	నష్టం (టన్నుకు రూ.ల్లో)	మొత్తం నష్టం (రూ.కోట్లలో)
2019-20	86.65	5,413	3,135	2,325	1,979
2020-21	45.15	9,155	2,935	6,220	2,736
2021-22	64.51	8,210	3,300	4,910	3,145
2022-23	71.99	7,451	4,088	3,363	2,421
2023-24	59.31	9,368	4,628	4,740	2,812
2024-25	28.14	8,820	4,842	3,928	1,105

మొక్కజొన్నకు కత్తెర 'కాటు'

మొలక దశలోనే ఆశిస్తున్న పురుగు

ఇల్లెందురూరల్: యాసంగిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన రైతులు అత్యధికంగా మొక్కజొన్న పంట సాగు చేస్తారు. ఈమేరకు దుక్కి సిద్ధం చేసి విత్తనాలు కూడా విత్తారు. అవి మొలకలుగా ఎదుగుతుండగా వానాకాలం మాదిరిగానే యాసంగిలోనూ కత్తెర పురుగు మొదలైంది. కత్తెర పురుగులు ఆకులను తినేయడంతోపాటు మొక్క కాండాన్ని ఛిద్రం చేస్తున్నాయి. ఈ పరిణామం మొక్క ఎదుగుదలపై ప్రభావం చూపుతోందని రైతులు వాపోతున్నారు. అంతేకాక ఆకులు మాడిపోతుండడం గమనార్హం. కాగా, పురుగు ఉధృతి ప్రారంభదశలోనే ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఇల్లెందు వ్యవసాయ శాఖ అధికారి సతీష్ సూచించారు. మార్కెట్‌లో ఈ పురుగు నివారణ మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కత్తెర పురుగు సూర్యరశ్మి ఉన్నంతసేపు ఆకు కాండంలోనే తలదాచుకుని, రాత్రివేళ బయటకు వచ్చి ఆకులను తింటుందని పేర్కొన్నారు. ఈనేపథ్యాన వాతావరణం చల్లగా ఉన్నప్పుడు, ఉదయం లేదా సాయంత్రం క్రిమిసంహారక మందులు ప్రయోగిస్తే ఫలితముంటుందని తెలిపారు.



కత్తెర పురుగును చూపిస్తున్న రైతు

ముక్కోటి పనులు చకచకా..

ఆన్‌లైన్‌లో వేగంగా టికెట్ల విక్రయం

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 31 నుంచి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఉత్తర ద్వారంతో పాటు ప్రధాన ఆలయం వెలుపల పంచరంగుల వేసే పనులు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని భద్రుని గుడి, ఇతర ఉపాలయాలకు సైతం రంగులు వేస్తున్నారు. తెప్పోత్సవం నిర్వహించే హంస వాహనాన్ని సిద్ధం చేయాల్సి ఉండగా, ఇతర పనులను సైతం త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో టికెట్లు..

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జనవరి 10వ తేదీ తెల్లవారుజామున నిర్వహించే ఉత్తర ద్వార దర్శనం టికెట్లను అధికారులు ఆన్‌లైన్‌లో ఉంచగా, విక్రయాలు వేగంగా సాగుతున్నాయి. రూ.2వేల విలువైన వీఐపీ టికెట్లు 650 ఆన్‌లైన్‌లు అందుబాటులో ఉండగా శనివారం నాటికి 157 అమ్ముడయ్యాయి. రూ.1000 టికెట్లు 200కు 105, బీ సెక్టార్‌కు సంబంధించి రూ.500 విలువైన టికెట్లు 425కు 105, సీ సెక్టార్‌లో 140కి 38, డీ సెక్టార్‌లో 100కు 7, ఈ సెక్టార్‌లో రూ.250 విలువైన టికెట్లు 325కు గాను 31 టికెట్లు విక్రయాలు జరిగాయి.



ఉత్తర ద్వారానికి రంగులు వేస్తున్న కార్మికులు



భద్రుని గుడికి రంగులు వేస్తున్న దృశ్యం

లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తికి ప్రణాళిక

టేకులపల్లి: ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలల సమయమే ఉన్నందున లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేసేలా ప్రణాళికాయుతంగా పనిచేయాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టు, ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. టేకులపల్లి మండలం కోయగూడెంలోని ఓపెన్‌కాస్ట్‌లో అధికారులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాలను పరిశీలించి రోజువారి ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీతపై ఏరియా జీఎం వీసం కృష్ణయ్యతో సమీక్షించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేస్తూనే రవాణాపై దృష్టి సారించాలని సూచించారు. రక్షణ సూత్రాలు పాటించడంతో పాటు యంత్రాల పనిగంటలని పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమం అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, గోవిందరావు, సౌరభ సుమన్, గంగాధర్రావు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేఓసీలో పనిప్రదేశాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

పాఠశాలలకు నిలిచిన బియ్యం సరఫరా

సీఆర్‌పీల సమ్మె ప్రభావమే కారణం

నేలకొండపల్లి: సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమ్మెతో పాఠశాలల్లో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. అంతేకాక మండల విద్యా వనరుల కేంద్రాలు తెరిచేవారు కరువయ్యారు. ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో దాదాపు 632 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమైన బియ్యాన్ని మండల లెవల్ స్టాక్ పాయింట్ నుంచి తీసుకొస్తారు. ఈక్రమంలో మండల విద్యా వనరుల కేంద్రంలో పనిచేసే సీఆర్‌పీ వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు వీరంతా సమ్మెలో ఉండడంతో పాఠశాలలకు బియ్యం సరఫరా నిలిచిపోయింది. జిల్లాలోని మూడు మండలాల్లో మాత్రమే ఎంఈఓలకు వేలిముద్ర అవకాశం ఉండగా ఆ మూడు మండలాల్లోని పాఠశాలలకు బియ్యం చేరింది. మరోపక్క సీఆర్‌పీల సమ్మెతో మండల విద్యావనరుల కేంద్రాలు తెరిచే వారు లేక అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీరోజు విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వివరాలను డీఈఓ కార్యాలయానికి చేరవేయడంలోనూ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. అలాగే, కేజీబీవీల్లో బోధన కుంటుపడుతోందని ఇప్పటికే విద్యార్థులు ఆందోళనలు నిర్వహిస్తున్న నేపథ్యాన ప్రభుత్వం స్పందించాలని పలువురు కోరుతున్నారు.